క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన నక్షత్రతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

చక్రాయపేట : మండలంలోని మహదేవపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.నక్షత్ర రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు రవికుమార్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. అక్టోబర్ 31న అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని నీలకంఠరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. దీంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు.

ఖోఖో పోటీల్లో ప్రతిభ



విజేతలతో ఆర్టీపీపీ సీఈ, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని డీఏవీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు డీఏవీ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస గుప్తా తెలిపారు. ఆ విద్యార్థులను ఆర్టీపీపీ సీఈ నాగరాజు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన అండర్-14, 17 విభాగాలలో ఆర్టీపీపీ విద్యార్థులు యతీష్, రాఘవ, రాణా, సురేష్, కిరణ్, హరిత ప్రతిభ చూపారని తెలిపారు. వీరు చిత్తూరు జిల్లాలో ఈ నెల 9, 10, 11 తేదీలలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే ఈ నెల 16, 17, 18 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే పోటీలకు ప్రసాద్, దీపక్, రామాంజనేయులు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో సత్తా



విజయం సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్, పీఈటీ

వేంపల్లె : స్థానిక వివేకానంద హైస్కూలు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో జిల్లా స్థాయి ఖోఖో, బాస్కెట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయారు. వారికి సోమవారం ఆ పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఖోఖోలో అండర్-17 విభాగంలో వై.మహేశ్వర్, అండర్-14 విభాగంలో ఎం.అంజన్‌కుమార్, కె.సాహిత్య ఎంపికయ్యారని తెలిపారు. బాస్కెట్ బాల్ అండర్-17 విభాగంలో ఒ.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, కె.ఓంకార్, అండర్-14 విభాగంలో ఎం.ప్రవీణ్‌కుమార్, సి.హాసిని ఎంపియ్యారన్నారు. కార్యక్రమంలో పీఈటీ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన నియామకం



అశోక్‌కుమార్

వేంపల్లె : జాతీయ మానవ హక్కుల మండలి (ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అఫ్ కౌన్సిల్) యూత్ జనరల్ సెక్రటరీగా వేంపల్లె పట్టణానికి చెందిన ముద్ది అశోక్‌కుమార్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం వాటిల్లినప్పుడు తక్కువ ఖర్చుతో న్యాయ సాయం పొందే అవకాశం ఈ కౌన్సిల్ ఇస్తుందన్నారు. ఆయనను జాతీయ ఉపాధ్యక్షుడు తులసి, శేషుకుమార్, జాతీయ యువ అధ్యక్షుడు మండిపల్లి రామాంజనేయులురెడ్డి, ఏపీ జనరల్ సెక్రటరీ రెడ్డయ్య తదితరులు అభినందించారు.

రేపు మండల సమావేశం

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవార ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. కావున మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డు ప్రాంతంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. పార్నపల్లె రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి కరెంట్ లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సింహాద్రిపురం.. ప్రగతి పథం



నిర్మాణం పూర్తి కావస్తున్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలు



వైఎస్సార్ పార్కు పనులు చేపడుతున్న దృశ్యం

- శరవేగంగా అభివృద్ధి పనులు
- ఎంపీ చొరవతో రూ.200 కోట్లు మంజూరు
- డిసెంబర్‌లో సీఎం చేతుల మీదుగా ప్రారంభం

సింహాద్రిపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో రూ.200 కోట్ల నిధులతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అందులో భాగంగా సింహాద్రిపురంతో పలు పనులు చేపడుతున్నారు. వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబర్ నెలలో పులివెందుల పర్యటనకు ముఖ్యమంత్రి రావడం జరుగుతుంది. ఆ సందర్భంగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

మండల ప్రజల హర్షం

సింహాద్రిపురం మండలంలో నెలకొన్న సమస్యలను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తీసుకెళ్లారు. సింహాద్రిపురంలో చిన్నపాటి వర్షం వచ్చినా.. రోడ్లన్ని గుంతలమయంతోపాటు బురదమయంగా మారిపోతున్నాయి. అలాగే డ్రైనేజీ వ్యవస్థ కూడా అధ్వానంగా ఉంది. మండలంలోని ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ముస్లింల కోసం షాదీఖానా, పాత టీటీడీ కల్యాణ మండపాన్ని పునరుద్ధరించాలని ఎంపీ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇందుకు ఆయన స్పందించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పాడా ఓఎస్‌డీ సలహాలతో సింహాద్రిపురం మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించేలా సంబంధిత అధికారులతో మాట్లాడారు. సింహాద్రిపురం మండలంలో బస్టాండు, నూతన స్కూల్ భవనాలు, పార్కు, బలపనూరులో టీటీడీ కల్యాణ మండపం, ముస్లింలకు షాదీఖానా, గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తగా నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే విధంగా వైఎస్సార్ క్లీనిక్‌లు, రైతులకు ఆర్‌బీకే కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో సింహాద్రిపురం మండలంలో ఎటువంటి అభివృద్ధి జరుగకపోవడంతో.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కోట్ల రూపాయల నిధులను విడుదల చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ముమ్మరంగా కల్యాణ మండప నిర్మాణం

చక్రాయపేట : చక్రాయపేటలో వెలసిన శ్రీవేంకటేశ్వర, రాచరాయ స్వామి (వీరభద్రస్వామి)ఆలయాల ప్రాంగణంలో నూతన కల్యాణ మండపం నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో ఎక్కడే గానీ కల్యాణ మండపం లేదు. ఇక్కడి వారు వివాహాది శుభకార్యాలకు వేంపల్లెకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆలయ పాలక మండలి బృందం సమావేశమై కల్యాణ మండపం నిర్మించాలని తీర్మానం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి సహకారంతో కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి కల్యాణ మండపం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డితో చర్చించి సుమారు రూ.70 లక్షలు మంజూరు చేయించారు. దీంతో పాలకమండలి సభ్యులు దగ్గరుండి నిర్మాణ పనులను వేగవంతంగా చేయిస్తున్నారు. మరో నెల రోజుల్లో కల్యాణ మండపం పనులను పూర్తి చేసి మండల వాసులకు అందుబాటులోకి తెస్తామని ఆలయ పాలక మండలి బృందం పేర్కొంది. శిథిలావస్థకు చేరుకున్న అతి పురాతనమైన చరిత్ర కలిగిన ఆలయాలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో పూర్వ వైభవం సంతరించుకోగా.. ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కల్యాణ మండపం నిర్మాణం జరగడం ఆనందదాయకంగా ఉందని పాలకమండలి బృందంతోపాటు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చురుగ్గా సాగుతున్న కల్యాణ మండపం నిర్మాణ పనులు

జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలి



మినుము పంటను పరిశీలిస్తున్న ఉద్యాన సలహాదారు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం: రైతులు వ్యవసాయాధికారులు అందించే సలహాలు, సూచనలు, జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని టి.చదిపిరాళ్ల, గొళ్లపల్లె గ్రామాల పొలాల్లో సాగులో ఉన్న మినుము పంటను వ్యవసాయాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబర్ నెలలో వర్షాలు కురవడంతో రబీ సీజన్‌లో భాగంగా అత్యధికంగా మినుము పంట సాగు చేశారన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండి పోయే అవకాశం ఉందన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత బెట్ట పరిస్థితులను తట్టుకోవడానికి నెలలోపు మినుము పంటకు పురుగు నివారణ మందులతోపాటు లీటర్ నీటికి 5 గ్రాముల 19-19-19ను కలిపి పిచికారి చేయాలన్నారు. నెల తర్వాత పైరుకు పురుగు నివారణ మందులతోపాటు లీటర్ నీటికి 5 గ్రాముల 13-0-45ను కలిపి పిచికారి చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల మొక్కకు త్వరగా పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్, జగన్ మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, చిన్ని, మైసూరారెడ్డి, సురేష్, ఏఈఓ దస్తగిరి, వీఏఏ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి



చదిపిరాళ్ల వద్ద పంట పొలాలు పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం : కరువు జిల్లాలో జాబితాలో వైఎస్సార్ జిల్లా లేకపోవడం విచారకరమని, తక్షణం జిల్లాను కరువు జాబితాలో చేర్చి సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు తెలిపారు. మండలంలోని చదిపిరాళ్ల గ్రామ పొలాల్లో సాగు చేసిన మినుము పంటను ఆయన సీపీఐ నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 103 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించిందని, ఇందులో వైఎస్సార్ జిల్లాలోని ఒక్క మండలం కూడా లేకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నాయకులు యంవీ సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, బాదుల్లా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల జాబితా పెంచాలి

ఎర్రగుంట్ల : ప్రభుత్వం కరువు మండలాల జాబితా పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జీ ఓబులేసు అన్నారు. సీపీఐ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త కరువు పర్యటనలో భాగంగా మండల పరిధిలోని దండుపల్లి, చిర్రాజుపల్లి, వామికొండ రిజర్వాయర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కరువు జిల్లాల జాబితాలలో కడప జిల్లా లేకపోడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

చింతకొమ్మదిన్నె : చామంతి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాఖ అధికారిణి కె.జ్యోతిర్మయి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో చామంతి సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చామంతి రకాల ఎంపిక, తెగుళ్లు, సూక్ష్మ పోషకాల లోపాలు, పూల నాణ్యత, దిగుబడి పెంచడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. హార్మోన్ల వాడకం ద్వారా పూల కోతను మార్కెట్ డిమాండ్‌ను బట్టి, ఆలస్యం లేదా త్వరగా కోతకు వచ్చేలా చేయడం, సస్యరక్షణ, నారు శుద్ధి, ట్రైకోడర్మా ప్రాముఖ్యత, పూలలో నిల్వ శాతం పెంచడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త మానస, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు డీవైఈఓగా క్రిష్ణప్ప

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా సోమవారం జి.క్రిష్ణప్ప బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె ఉపవిద్యాశాఖాధికారిగా పని చేస్తున్న ఈయనను రెగ్యులర్ ఉపవిద్యాశాఖాధికారిగా నియమించారు. ఈయన 1987లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొంది తరువాత సీనియర్ అసిస్టెంట్‌గా, సూపరింటెండెంట్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా తరువాత మదనపల్లెలో ఉపవిద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2016-17లో కడప డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు ప్రధానోపాధ్యాయులు కాశీ ప్రసాదరెడ్డి, రవి, సత్యబాబు, డీవైఈఓ కార్యాలయ సీసీ నిత్యపూజరెడ్డి, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు.

కృతజ్ఞతలు



తహసీల్దార్‌లుగా పని చేస్తూ ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌లుగా పదోన్నతి పొందిన పలువురు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడలో సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరిలో పులివెందుల సీఎం క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్‌గా పని చేస్తున్న రాంభూపాల్‌రెడ్డి, విజయవాడలో విధులు నిర్వర్తిస్తున్న మోహన్‌రావు, చిత్తూరు జిల్లా వరదయ్యపాళెంకు చెందిన గౌరీశంకర్ ఉన్నారు. - పులివెందుల

సామాజిక తనిఖీ బృందానికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2022- 23 ఆర్థిక సంవత్సరంలో వల్లూరు మండల పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ జరగనుందని, తనిఖీ బృందానికి ఉపాధి హామీ సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని ఎంపీడీవో కేఆర్ఎమ్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృంద సభ్యులకు సోమవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జరిగిన పనులన్నింటినీ తనిఖీ బృందానికి చూపించడమే కాక వాటికి సంబంధించిన రికార్డులతోపాటు పూర్తి వివరాలను అందజేయాలని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామ సభలను నిర్వహించాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులతోపాటు పెన్షన్ల పంపిణీ, పంచాయతీ రాజ్ పనులను పరిశీలించడం జరుగుతుందని డ్వామా డీవీవో యోగాంజనేయరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు సుధారాణి, పార్థసారధి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజీబ్, పీఆర్ ఏఈ పవన్ కుమార్, ఎస్ఆర్‌పీ లక్ష్మినారాయణ, ఈసీలు అన్నా నాయక్, అంజలి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

జమ్మలమడుగు : ఫ్యాక్టరీలలో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ పరిధిలోని సభా భవనంలో పోలీసు, రెవెన్యూ, ఫైర్ సిబ్బందితో కలిసి పరిశ్రమలలో ప్రమాదం జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు డివిజన్ పరిధిలో మొత్తం 9 ప్రమాదకరమైన ఫ్యాక్టరీలు ఉన్నట్లు తెలిపారు. ఇవి వాడుతున్న కెమికల్స్ వల్ల బయట ఉన్న ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఫ్యాక్టరీ యాజమాన్యం చేతులు ఎత్తేసి కమిటీ సభ్యులకు సమాచారం ఇస్తే.. వెంటనే కమిటీ సభ్యులు ఈ ప్రమాద నివారణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా అవగాహన లేకపోతే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి అన్ని శాఖల వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పరిశ్రమలలో ప్రమాదం జరిగినప్పుడు వెంటనే వారు సైరన్ మోగిస్తే ప్రజలు అప్రమత్తమై.. దూర ప్రాంతాలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్‌బాషా, రెవెన్యూ, పోలీసు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి



ఎర్రగుంట్ల : అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగేశ్వరరావు

ఎర్రగుంట్ల : దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే టపాసుల దుకాణాల యజమానులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో టపాసుల దుకాణాల కోసం 17 మంది అనుమతి పొంది ఉన్నారన్నారు. ఎర్రగుంట్లలో 11, పోట్లదుర్తి 4, కలమల్ల 1, చిలంకూరులో 1 దుకాణాలకు అనుమతులు వచ్చాయన్నారు. వీటి ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాల్సిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రహంతులయ్య, హౌసింగ్ ఏఈ రామక్రిష్ణ, ఏపీఎం జగదీశ్వరీ, డిప్యూటీ తహసీల్దార్ రమణారెడ్డిలు పాల్గొన్నారు.

అతిక్రమిస్తే చర్యలు

వేంపల్లె : టపాసుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సీఐ చాంద్‌బాషా, ఎస్సై తిరుపాల్‌నాయక్, విద్యుత్‌శాఖ జేఈ చంద్రశేఖర్, ఫైర్ సిబ్బందితో కలిసి టపాసుల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల విద్యాభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు కల్చరల్ : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, గీతాశ్రమం అభివృద్ధికి శ్రీ మళయాలస్వామి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ శనివారపు భాస్కర్‌రెడ్డి విశేష కృషి చేశారని ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలో సోమవారం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ శనివారపు భాస్కర్‌రెడ్డి, గంగాదేవి దంపతుల సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలోని విద్యాసంస్థల నూతన భవన సముదాయాల నిర్మాణానికి కృషి చేశారన్నారు. శారదా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్‌బాబురెడ్డి మాట్లాడుతూ తాను జీవించి ఉన్నప్పుడే ఆశ్రమంలో డీఈడీ, బీఈడీ కళాశాలలను పునరుద్ధరించడానికి ప్రయత్నించారన్నారు. కార్యక్రమంలో వ్యాపార వేత్త సీవీ.సుబ్బారావు, బీఎడ్, డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌లు డాక్టర్ ధనరాజ్, డాక్టర్ నల్లం నాగేశ్వరరావు, శ్రీకృష్ణ ఓరియంటల్ హైస్కూల్ హెచ్ఎం సుదీర్‌కుమార్, ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం రాజేశ్వరమ్మ, వేదవ్యాస డిగ్రీకళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, ఆశ్రమంలోని విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

కమలాపురం : కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలని, అలాగే విశాఖ ఉక్కును పరిరక్షించాలనే డిమాండ్లతో ఈ నెల 8న జరపనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. సోమవారం కమలాపురం మండలంలోని అన్ని పాఠశాలలకు వెళ్లి ఆయన విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు తులసీశ్వర్ యాదవ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు ఏర్పాటైతే..

ఎర్రగుంట్ల : ఈ నెల 8న విద్యా సంస్థల బంద్‌కు ఏఐఎస్ఎఫ్ పిలుపు ఇచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ జమ్మలమడగు ఏరియా కార్యదర్శి శరత్‌కుమార్ తెలిపారు. యర్రగుంట్ల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటైతే నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

మైదుకూరు : మున్సిపాలిటీలోని తిమ్మాయపల్లెలో అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠగా జరిగాయి. జాక్‌పాట్ విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను నిర్వాహకులు అందించారు. మంగళవారం చిన్న బండలాగుడు పోటీలు, మనుషులు గుండు ఎత్తే పందెం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కార్తీక మాసోత్సవాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10వ తేదీల్లో బద్వేలు డిపో నుంచి వివిధ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం, మహానంది, ఓంకారం, శ్రీశైలం, కాశినాయన క్షేత్రం, సిద్దేశ్వరం, భైరవకోన, నారాయణస్వామి మఠం, నర్రవాడ, లంకమల, నిత్యపూజకోన, పొలతల క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9959225779 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా దస్తగిరిస్వామి జెండా పండుగ

దువ్వూరు : దస్తగిరిస్వామి జెండా పండుగను సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటలకు గ్రామంలోని పురవీధుల్లో వేళతాళాలతో ఫకీర్ల విన్యాసాలతో జెండాను ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాపురం గఫరియా దర్గా పీఠాధిపతి జహురుద్దీన్ షా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు దర్గా కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు.

నేడు రైతుభరోసా నిధుల విడుదల

అట్లూరు : బద్వేలు మండలం బొజ్జిరెడ్డి కల్యాణ మంటపంలో మంగళవారం రైతుభరోసా నిధులు విడుదల కార్యక్రమం నిర్వహించనున్నట్లు బద్వేలు, పోరుమామిళ్ల డివిజన్‌ల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు, ఎం.మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టరు సుధా హాజరు అవుతారన్నారు. నియోజక వర్గం పరిధిలోని 37,396 మంది రైతులకు రూ. 14.96 కోట్ల నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారివారి అకౌంట్లకు నేరుగా జమచేయనున్నట్లు తెలిపారు.

దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు సోమవారం సంస్థ ప్రతినిధులు ప్రసాదరెడ్డి, శ్రీకాంతరెడ్డి ద్వారా స్థానిక ఓయల్ఎఫ్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు 540 మందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి ఎఫ్‌సీయన్ సంస్థ క్రిస్మస్, నూతన సంవత్సరాలను పురష్కరించుకొని విద్యార్థులకు ఉచితంగా దుస్తులు అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విజయరాణి, హెడ్మాష్టర్ ఆరోగ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాజుపాళెం : రాజుపాళెం గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ప్రతాపుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వివిధ పోటీలు నిర్వహించి 20న విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు గ్రంథాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.